రైలు ప్రమాద బాధితులు కోలుకొనేవరకూ ఆసుపత్రిలోనే చికిత్స

- గురువారంలోగా పరిహారం పంపిణీ పూర్తి
- జీవితాంతం ఉపాధి చూపేలా మానవతా దృక్పథంతో సహాయం
- గాయాల పాలైన 30 మందికి రూ.1.29 కోట్లు
- మృతి చెందిన 13 మంది కుటుంబాలకు రూ.1.30 కోట్లు పరిహారం
- ఆసుపత్రిలో క్షతగాత్రులకు పరిహారం చెక్కులు అందించిన మంత్రి బొత్స

విశాలాంధ్ర-విజయనగరం: రైలు ప్రమాద బాధితులకు జీవితాంతం ఉపాధి కల్పించేలా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి మానవతా దృక్పథంతో సహాయం ప్రకటించారని, సి.ఎం. ప్రకటించిన సహాయాన్ని గురువారంలోగా బాధిత కుటుంబాలకు అందజేసే కార్యక్రమం పూర్తిచేస్తామని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ వెల్లడించారు. ఇప్పటికే మంగళ, బుధవారాల్లో విజయనగరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు పరిహారం అందజేశామన్నారు. కంటకాపల్లి రైలు ప్రమాద దుర్ఘటనలో గాయపడి స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం చెక్కుల రూపంలో అందజేశారు. ఆసుపత్రిలోని వార్డుల్లో చికిత్స పొందుతున్న బాధితుల వద్దకు వెళ్లి మంత్రి బొత్స సత్యనారాయణ వారిని పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్స వారి కుటుంబ పరిస్థితులు తెలుసుకొని వారికి ప్రభుత్వం అండగా వుంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందజేసిన పరిహారాన్ని చెక్కు రూపంలో అందజేసి వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయా వార్డుల్లో చికిత్స పొందుతున్న రైలు ప్రమాద బాధితుల ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి శ్రీ జగన్ ప్రకటించిన మేరకు రైలు ప్రమాద దుర్ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల వంతున 13 మంది మృతుల కుటుంబాలకు రూ.1.30 కోట్లు పరిహారంగా అందజేస్తున్నామన్నారు. ప్రమాదంలో గాయపడిన 30 మందికి రూ.1.29 కోట్లు పరిహారం అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. ప్రమాదంలో గాయపడి, శాశ్వత అంగవైకల్యానికి గురైన వారికి రూ.10 లక్షలు సహాయం అందిస్తున్నట్లు సి.ఎం. ప్రకటించారని, ఆ మేరకు ముగ్గురికి రూ.10 లక్షల వంతున రూ.30 లక్షలు అందజేశామన్నారు. నెలరోజులకు పైగా ఆసుపత్రిలో చికిత్స అవసరమైన వారికి రూ.5 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించారని, ఈ మేరకు నెలరోజులకు పైగా చికిత్స అవసరం అవుతుందని గుర్తించిన 15 మందికి రూ.75 లక్షలు పరిహారంగా ఇచ్చామన్నారు. నెల రోజుల్లోపల ఆసుపత్రిలో చికిత్స పూర్తిచేసుకొని డిశ్చార్జి అయ్యే వారికి రూ.2 లక్షలు పరిహారాన్ని ప్రకటించడం జరిగిందని 12 మందికి రూ.24 లక్షలు సహాయం అందించామన్నారు. గరివిడిలో బుధవారం మృతి

చెందిన నలుగురి కుటుంబ సభ్యులకు పరిహారం అందిస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లాపరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎం.పి. బెల్లాన చంద్రశేఖర్, ఎం.ఎల్.సి. సురేష్ బాబు, జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, డి.సి.హెచ్.ఎస్. డా.గౌరీశంకర్, డి.ఎం.హెచ్.ఓ డా.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థిని . షేక్ నూరునీష కు అంతర కళాశాలల తైక్వాండో లో మొదటి స్థానం



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోట పాలెం లో గల సత్య డిగ్రీ, కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న షేక్ నూరునీష గత నెల 21వ తారీఖున ఆంధ్ర యూనివర్సిటీ లో జరిగిన అంతర్ కళాశాలల గేమ్స్ మరియు స్పోర్ట్స్ ఉమెన్ విభాగం లో తైక్వాండోలో కిరోగి లో 53కేజీల విభాగం లో జరిగిన పోటీలలో మొదటి స్థానాన్ని కైవసం చేసుకొని నవంబర్ 5వ తారీఖు నుంచి 11వ తారీఖు వరకు రాజస్థాన్ జుంజున్ లో జరగబోయే జాతీయ స్థాయి అంతర్ యూనివర్సిటీ గేమ్స్ స్పోర్ట్స్‌లో పాల్గొనేందుకు అర్హత ను సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు మాట్లాడుతూ నీరుష జాతీయ స్థాయిలో కూడా మొదటి స్థానాన్ని సంపాదించుకొని రావాలని కోరారు. ప్రిన్సి పాల్ డాక్టర్ ఎం వి సాయి దేవమణి మాట్లాడుతూ నీరుషా కు గతంలో కూడా ఎన్నో మెడల్స్ తైక్వాండోలో వున్నాయని ఇప్పుడు వర్సిటీ స్థాయిలో పోటీ పడుతున్నదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌యస్ యస్ ఆఫీసర్ బి.సూరపునాయుడు, ఎన్‌సిసి ఆఫీసర్. ఉదయ్‌కిరణ్, కళాశాల అధ్యాపకులు పాల్గొని నీరుషాకు అభినందనలు తెలియజేశారు.

8న రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ

విశాలాంధ్ర-బొబ్బిలి : విశాఖ ఉక్కు పోరాటానికి నవంబర్ 8తో 1000 రోజులు అవుతున్న సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్ రక్షణ, కడప స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకై నవంబర్ 8న రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బందును విజయవంతం చేయాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాలతో బొబ్బిలి పట్టణంలో ఉన్న గంటి ప్రసాదం స్మారక భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం మరియు బందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం యుగంధర్ మాట్లాడుతూ విద్యార్థి యువజన సంఘాలు తలపెట్టిన ఈ రాష్ట్ర స్థాయి విద్యాసంస్థల బంద్‌లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసం32 మంది ప్రాణ బలిదానం, 23 వేల ఎకరాల విస్తీర్ణంలో కేవలం 4800 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు దాదాపు 54 వేల కోట్లు తిరిగి చెల్లించి 32 లక్షల టన్నుల నుంచి 74 లక్షల టన్నులకు సామర్థ్యాన్ని పెంచుకొని నేడు మూడు లక్షల కోట్లు విలువ చేసే ఆస్తులతో లక్షల మందికి ఉపాధిని కల్పిస్తూ విశాఖపట్నం అభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన స్టీల్ ప్లాంట్ ను కారు చవకగా తమ అన్యాయులైన అదానీ అంబానీలకు కట్టబెట్టడానికి కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఈ బంద్ సందర్భంగా విద్యార్థి యువజనల్లోకి విస్తృతం గా తీసుకువెళ్లాలని పిలుపు నిచ్చారు, ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎం శ్రీనివాస్. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట అప్పన్న. డివైఎఫ్ఐ జిల్లా నాయకులు ఏ సురేష్. అఖిల భారత విద్యార్థి సమైక్య జిల్లా సహాయ కార్యదర్శి బి రవికుమార్. ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు మణికుమార్‌లు మాట్లాడుతూ విద్యా సంస్థలు విద్యార్థులు స్వచ్ఛందంగా బంద్‌లో పాల్గొని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు, ప్రజలు, విద్యా సంస్థల యామాన్యాలు ఈ బంద్ లో స్వచ్ఛదంగా లక్షలాదిగా పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఐదు గ్రామాల్లో చురుగ్గా భూముల రీ సర్వే

విశాలాంధ్ర-వేపాడ: మండలంలో భూముల రీ సర్వే ప్రక్రియ చురుగ్గా జరుగుతోంది. మండలంలో మొత్తం 39రెవెన్యూ గ్రామాలుండగా ఇప్పటి వరకు బానాది, బిటికె రాజపురం, జమ్మాదేవిపేట, రాయుడుపేట, నీలకంఠరాజపురం, చామలాపల్లి తదితర గ్రామాల్లో అధికారులు రీ సర్వే పూర్తి చేయగా ప్రస్తుతం బల్లంకి, పెదగుడిపాల, ఓబలయ్యపాలెం, ముకుందపురం, అరిగిపాలెం గ్రామాల్లో భూముల రీ సర్వే పనులు చురుగ్గా జరుగుతున్నాయి. వీటి సర్వే పూర్తి చేసిన వెంటనే జాకేరు, గుడివాడ,ఆతవ, కరకవలస పాటూరు తదితర రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. కాగా సర్వే పనులు చురుగ్గా చేపడుతున్నప్పటికి అంతే వేగంగా పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీ జరగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అలాగే రైతులకు సంబంధించి భూముల సర్వేపక్కాగా చేస్తున్నప్పటికి కొన్నినంబర్లు నమోదు చేయక పోగా వాటికి మరలా మ్యుటేషన్ పెట్టుకోవాలని అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులు వాపోతున్నారు. సర్వే పక్కాగా చేసినట్లే నమోదు కూడా పక్కాగా చేయాలని మండల రైతాంగం కోరుతోంది.

4న జాబ్ మేళా : జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ

విశాలాంధ్ర-విజయనగరం: నిరుద్యోగ యువకులకు ఉపాధి కల్పించుటకు మూడు ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో 205 ఉద్యోగాలను నియమించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి అరుణ ఒక ప్రకటన లో తెలిపారు. ఈ నెల 4న ఉదయం 10 గంటల నుండి బిసి కాలనీ లో నున్న ఐ.టి.ఐ వద్ద జాబ్ మేళా జరుగుతుందని, ఈ మేళా కు పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగాలు నవత ట్రాన్స్ పోర్ట్, పేటిఎం, ముత్తూట్ ఫైనాన్స్ సంస్థలలో ఉన్నాయని, ఆసక్తిగల అభ్యర్థులు www.ncs.gov.in website job seeker login లో నమోదు చేసుకోవాలని తెలిపారు. బయో డేటా తో రెండు పాస్ పోర్ట్ సైజ్‌ఫోటోలతో ప్రభుత్వ ఐ.టి.ఐ వద్ద 4న హాజరు కావాలన్నారు.

స్వర్ణం సాధించిన ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థిని

విశాలాంధ్ర-మెంటాడ: అనంతపురం జిల్లా చిగిచెర్లలో జరిగిన జూడో రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్ 19 విభాగంలో విజయనగరం జిల్లా మెంటాడ మండలం పెద మేడపల్లి మోడల్ స్కూల్ కి చెందిన తూముల యశోద బంగారు పథకం గెలుపొందినట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఎం జగన్ మోహన్‌రావు తెలిపారు. తద్వారా జాతీయ స్థాయికి ఎంపిక జరిగిందని గతంలో కూడా ఇదే పాఠశాల నుండి అనేక మెడలు విద్యార్థిని విద్యార్థులు సంపాదించినట్లు ఆయన గుర్తు చేశారు. ఇకమీదట కూడా ఉన్నతమైన విద్యతోపాటు క్రీడల్లో మంచి నైపుణ్యతను ప్రోత్సహించి అనేక మెడల్స్‌ని సాధిస్తామని అన్నారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ సాధించిన యశోదను పీడి నారాయణరావు తో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, సీఎం సి కమిటీ అభినందించారు.

అమరజీవిని ఆదర్శంగా తీసుకోవాలి : కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం: అమరజీవి పొట్టి శ్రీరాముల త్యాగం, కృషి తో ఏర్పడిన ఆంధ్ర రాష్ట్రం అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లడనికి ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని జిల్లా కలెక్టర్. నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా కలెక్టరెట్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్ ఆడిటోరియంలో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి, తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్రం ఏర్పాటు చేయాలని పొట్టి శ్రీరాములు రెండు నెలల పాటు ఉపవాస ఉంటూ దీక్ష చేయగా కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాలను ఏర్పాటు చేసిందని, దాని ఫలితంగా ప్రత్యేక రాష్ట్రంగా ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడిందన్నారు. ఆయన త్యాగాన్ని స్మరించుకునే విధంగా నెల్లూరు జిల్లాకు పొట్టి శ్రీరాములు పేరును పెట్టారని గుర్తు చేశారు. త్యాగధనుల స్ఫూర్తితో అధికారులు ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగుదామన్నారు. ఆయన త్యాగాలను మరువ లేనిమని, ఆయన ఆశయాలను కొనసాగించాలని అన్నారు. సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారి కోసం తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేయాలని కృషి చేసిన పొట్టి శ్రీరాములు చిర స్మరనీయులని, వారి ఆశయాలను ముందుకు తీసుకువెళ్లాలని అన్నారు. ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత అనేక రంగాల్లో అభివృద్ధిని సాధించామని, భవిష్యత్తు లో అందరూ రాష్ట్రాభివృద్ధి లో భాగస్వామ్యం కావాలని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌ఓ ఎస్.డి.అనిత, పలు జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'నిజమే గెలిచింది'

- టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంపకృష్ణ

విశాలాంధ్ర-శృంగవరపుకోట: నిజమే గెలిచిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ అన్నారు. శృంగవరపుకోట నియోజకవర్గం తెలుగుదేశం యువ నేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గొంప క్రిష్ణ ఆధ్వర్యంలో "నిజమే గెలిచింది" అనే కార్యక్రమం ఎస్.కోట పట్టణంలోని ఆకుల డిపో వద్ద బుధవారం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా శృంగ వరపుకోట నియోజకవర్గం టీడీపీ పరిశీలకలు నారా యణమూర్తి చౌదరి హాజరయ్యారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల తెలుగుదేశం కార్యకర్తలతో ఆకుల డిపో వద్ద నుంచి దేవి బొమ్మ జంక్షన్ కూడలి వరకు సుమారు కిలోమీటర్ మేర పాదయాత్ర చేసి శ్రీ దుర్గాదేవి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆకుల డిపో వద్ద నిర్వహించిన సభ వద్ద గొంప క్రిష్ణ మాట్లాడుతూ టీడీపీ అధినేత నారా చంద్రబాబుకి బెయిల్ రావడం సంతోషకరమని వ్యాఖ్యానించారు. నియోజకవర్గ పరిశీలకులు నారాయణమూర్తి చౌదరి మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబు నాయుడు సారధ్యంలో ముందుకు వెళ్తుందని అన్నారు. ఇక నియోజకవర్గంలో రెండు వర్గాలు కార్యక్రమాలు చేయడం గుర్తించామని, త్వరలోనే పార్టీ ప్రతినిధులతో మాట్లాడి చంద్రబాబు, లోకేష్ బాబు దృష్టిలో పెడతామని వెల్లడించారు. కార్యక్రమంలో శృంగవరపు కోట నియోజకవర్గం టీడీపీ మరియు జనసేన మండల పార్టీ అధ్యక్షులైన లగుడు రవి కుమార్ (జామి టీడీపీ మండలం పార్టీ అధ్యక్షులు), పి.వర్మ రాజు (జామి జనసేన మండల పార్టీ అధ్యక్షులు), గొరపల్లి రాము (కొత్తవలస టీడీపీ మండలం పార్టీ అధ్యక్షులు), గొరపల్లి రవి(కొత్తవలస జనసేన మండల పార్టీ అధ్యక్షులు), గొంప వెంకటరావు (వేపాడ టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు), సుంకర అప్పారావు (వేపాడ జనసేన మండల పార్టీ అధ్యక్షులు), రాయవరపు చంద్రశేఖర్ (విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు), జక్కన కన్నబాబు (లక్కవరపుకోట మాజీ మండల పార్టీ అధ్యక్షులు), రెడ్డి పైడిబాబు (మాజీ మండల పార్టీ అధ్యక్షులు -జామి మండలం), గుమ్మడి భారతి (నియోజవర్గం మహిళా అధ్యక్షురాలు), ఇప్పాక త్రివేణి (మాజీ సర్పంచ్- జామి), తెలుగుదేశం, జనసేన సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి దివ్యసముఖమునకు
OS 88/2023

Between
బందారు సీతామహాలక్ష్మి ....వాది
And
1.లెంకా మురళీకృష్ణ S/o లేటు కృష్ణ
2.లెంకా మూర్తి S/o లేటు కృష్ణ
శారదానగర్ ఆర్‌టీసీ కాంప్లెక్స్ దరి
కొత్తవలస గ్రామం & మండలం
విజయనగరం జిల్లా
3.లెంకా రామకృష్ణ S/o లేటు కృష్ణ
కానిస్టేబుల్, కోసూరు పోలీస్ స్టేషన్
కోసూరు గ్రామం
గుంటూరు జిల్లా... ప్రతివాదులు

ఇందలివాది ప్రాంసరీ నోటును బట్టి మీపై నంబరు గల దావాను దాఖలు చేయగా సదరు దావాలో మీకు చాలా దఫాలుగా సమనులు పంపించినప్పటికీ మీరు బుద్ధి పూర్వకంగా, పుచ్చుకోకుండా తప్పించుకుంటాయున్నారు. గాన మీరు హాజరగుటకు గాను **తే.14-11-2023** దికి వాయిదా వేసిరి. గాన సదరు వాయిదానాడు పగలు గం॥ **10.30** ని॥లకు పై కోర్టుకి మీరు హాజరై మీకుగల అక్షేపణలు తెలియ వరచుకోవలెను. అలాగున మీరు హాజరు కానిచో మీ పరోక్షమందు వాజ్యం తీర్మానించడమగును.

శృంగవరపుకోట
తే.01.11.2023

నానిగిరి తులసీవివేకానందదాస్
వాది తరపు అడ్వకేట్

అడవిలో విలువైన ఖనిజ సంపదను దోచేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర...



విశాలాంధ్ర-కురుపాం: రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తో జోడి కట్టి అడవిలో విలువైన ఖనిజ సంపదను దోచేందుకు ఆదివాసీ చట్టాలను సవరణ చేస్తూ కుట్రలు చేస్తోందని కోరన్న మంగన్న ఉద్యమ స్పూర్తితో ఐక్య పోరాటానికి ఆదివాసీలంతా సిద్ధంకావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు గుజ్జల ఈశ్వరయ్య, పి.కామేశ్వరరావు లు పిలుపునిచ్చారు. గుమ్మలక్ష్మీపురం లో ఘనంగా కోరన్న మంగన్న వర్ధంతి సభను మన్యం జిల్లా సిపిఐ బృందం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లుగా చేసిన అభివృద్ధి కన్నా దోపిడీ యో అదికం అని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతంలో ఇంకా తప్పనిసరి డోలీ మోతలు, స్వచ్ఛమైన తాగునీరు లేని గ్రామాలు కోకొల్లలు అన్నారు. విద్య, వైద్యం అందని ద్రాక్ష గానే మిగిలిందని సమస్యలు పరిష్కరించాలంటే ఎర్రజెండా పోరాటం తోనే సాధ్యం అని నాటి శ్రీకాకుళ సాయుధ రైతాంగ పోరాటం ఫలితంగా నేడు ఏజెన్సీ ప్రాంతంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అని గుర్తు చేశారు.

భూమిపై శాశ్వత హక్కు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే జోగారావు



విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ప్రతి రైతుకు తన భూమిపై శాశ్వత హక్కును కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే అలజంగి జోగారావు అన్నారు. బుధవారం మండలంలోని డోకిశీల పంచాయతీ చలం వలస గ్రామంలో భూ పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన రెడ్డి వేలాది కోట్ల రూపాయలు నిధులతో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైఎస్ఆర్ జగనన్న శాశ్విత భూహక్కు-భూ పదకం "మీ భూమి - మా హామీ" అనే రీ సర్వే కార్యక్రమం ద్వారా రైతన్నలకు తమ భూమిలో సరిహద్దు రాయి వేయటానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు లేకుండా భూ వివాదాలను పరిష్కరించడం, సమగ్ర సర్వేను నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తిచేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవడం జరిగిందని తెలిపారు.మన రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూముల రీసర్వే కార్యక్రమాన్ని మూడు దశల్లో పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది అని, మొదటి దశలో 5,300, రెండో దశలో 5,700, మూడో దశలో 6,460 రెవెన్యూ గ్రామాల్లో సర్వే త్వరలో పూర్తి జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శివన్నారయన, జెడ్పీటీసీ ప్రతినిధి బలగ నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు బోమ్మి రమేష్, ఎంపీపీ ప్రతినిధి మజ్జి శేఖర్, గ్రామ సర్పంచ్ ఎస్ జగదీష్, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కొట్టు సర్పంచ్ మృతికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి విజయరామరాజు



విశాలాంధ్ర-కొమరాడ : మండలం కొట్టు పంచాయితీ సర్పంచ్ తెర్లి నాగభూషణ్ గత కొద్ది రోజుల నుండి అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం విశాఖపట్నం ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు ఈ విషయం తెలుసుకున్న టిడిపి మాజీ మంత్రివర్యులు విజయరామరాజు ఒక్కసారిగా షాప్ గురయ్యారు బుధవారం సాయంత్రం నాగభూషణం అంత్యక్రియలో శత్రు చర్ల విజయరామరాజు పాల్గొన్నారు అనంతరం మాట్లాడుతూ ఒక మంచి మిత్రుని కోల్పోయానని ఆవేదనకు గురయ్యారు అతనితో ఉన్న సంబంధాలు ఇప్పుడు కాదని గత 20 సంవత్సరాలు నుండి నాగభూషణంతో శతసంబంధాలు ఉన్నాయని భగవంతుడు చిన్న వయసులోనే ఆయనకు మరణం వచ్చిందని ఆయన బాధపడ్డారు నాగభూషణ ఆత్మకు శాంతి కూరేలా భగవంతుడిని కోరుతున్నాను తెలుగుదేశం పార్టీ తరపున ఆయన కుటుంబాలకు అన్ని విధాలుగా అండగా ఉంటామని ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు అలాగే కురుపాం నియోజవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ తోయక జగదీశ్వరి కొమరాడ మండల కన్వీనర్ శేఖర్ పాత్రుడు గులిపిలి సుదర్శన్ రావు టిడిపి నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.

వంతెన నిర్మించండి...

విశాలాంధ్ర-కురుపాం : శిథిలావస్థలో ఉన్న వంతెన స్థానంలో కొత్త వంతెనను నిర్మించి ప్రజల ప్రాణాలను కాపాడాలని గిరిజన సంఘం నాయకులు ఎం.రమణ అధికారులు కోరారు. బుధవారం మండంలో మొండెంఖల్ సమీపంలో ఆయన మాట్లాడుతూ గుమ్మక్ష్మీపురం నుండి నీకంఠాపురం మీదగా శ్రీకాకుళం జిల్లాకు వందలాది వాహనాలు వెళ్తుంటాయని, ఈ వంతెన సైడ్ రిటైరింగ్ వాళ్ళు కూడా సక్రమంగా వంతెన కూడా పురాతనమైంది. మరియు ఇరుకుగా ఉండటంపై చాలాసార్లు వాహనాలు రోడ్డు ప్రమాదాలు గురై కొందరు మృత్యువాత పడగా మరికొందరు తీవ్ర గాయాలయ్యాయని, ఇటువంటి సంఘటను ఎన్నో ఉన్నాయని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే వంతెనను పునర్మించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

సాదాసీదాగా మండల సర్వసభ్య సమావేశం



విశాలాంధ్ర-సాలూరు రూరల్: స్థానిక ఎంపిడిఓ కార్యాలయం లో ఎంపిపి జి.రాములమ్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది.ముందుగా ప్రజాప్రతినిధులు తమ సమస్యలను సభ దృష్టి కి తీసుకువచ్చారు. కరడవలస సర్పంచ్ గెమ్మెల.శంకరరావు మాట్లాడుతూ ఉపముఖ్యమంత్రి చొరవతో తమ గ్రామాలకు రహదారి నిర్మాణం పూర్తయిందన్నారు. రేషన్ సరుకులు తమ గ్రామం వద్ద అందజేయాలని కోరారు.రహదారి సౌకర్యం లేక దండిగాం, జిల్లేడువలస గ్రామాలకు వెళ్లి రేషన్ తీసుకునేవారమన్నారు. నేడు రహదారి ఉన్నందున తమ గ్రామంలో డిపో ఏర్పాటు చేయాలని కోరారు. శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా చేసిన అభివృద్ధి పనులకు ఎంబుక్ రికార్డ్ చేయడంలో జాప్యం జరుగుతుందన్నారు. దీనితో బిల్లులు సకాలంలో అందడం లేదన్నారు. దీనిపై వైస్ ఎంపిపి రెడ్డి సురేష్ స్పందించారు.త్వరగా ఎం బుక్ రికార్డ్‌చేయాలని సిబ్బంది కి సూచించారు.వ్యవసాయ అధికారులు మాట్లాడుతూ చిరు ధాన్యాల ను కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్ పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్‌ఎంపిపి సువ్వాడ. గుణవతి, ఎంపిడిఓ గొల్లపల్లి పార్వతి, ఎమ్మార్వో, ఐసిడియస్ సిడిపిఓ సత్యవతి,డిప్యూటీ డిఎంహెచ్‌ఓ శివకుమార్ తదితర్లు పాల్గొన్నారు.

అమరజీవి త్యాగఫలమే నేటి ఆంధ్రప్రదేశ్.....

మున్సిపల్ కమిషనర్ అప్పలనాయుడు

విశాలాంధ్ర పార్వతీపురం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమని, దేశంలో అనేక బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు అన్నారు. నవంబరు 1వ తేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణను పురస్కరించుకొని బుధవారం మున్సిపల్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు గాందేయవాదంతో ఆరువారాల పాటు ఆమరణనిరాహార దీక్షచేసి ప్రాణత్యాగం చేసారన్నారు. వారి త్యాగఫలితంగా ప్రజాగ్రహానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిటీ వేసి అమలు చేయడం జరిగిందని, 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిందని తెలిపారు. ఉద్యోగులు దేశం,రాష్ట్రం అభివృద్ధికి కృషిచేయాలని, ప్రజల కోసం వారి జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్య సమయయోదుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్, రెవెన్యూ, ప్రణాళిక విభాగం, పారిశుద్ధ్య, పరిపాలన విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అవతరణ దినోత్సవం

జాతీయ జెండాను ఆవిష్కరించిన ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురం: అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను పోలీస్ సంప్రదాయ నడుమ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆవిష్కరణ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ గూర్చి, అమరవీరులు పొట్టి శ్రీరాములు గూర్చి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు గారి త్యాగఫలితమని, దేశంలో అనేక బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు గారు ఆద్యుడని గుర్తుచేసుకుంటూ, స్వాతంత్ర్యం సిద్ధించే నాటికి దేశంలో అనేక సంస్థానాలు, రాజ్యాలు ఉన్నాయని వాటినన్నింటిని ఏకంచేసిన పిదప పరిపాలన సౌలభ్యం కొరకు రాష్ట్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒకే బాష మాట్లాడే వారికి ఒకేరాష్ట్రం ఉండాలని, వివక్షకు గురవుతున్న తెలుగువారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు గాందేయవాదంతో ఆరువారాల పాటు ఆమరణనిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసారన్నారు. వారి త్యాగఫలితంగా ప్రజాగ్రహానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిటీ వేసి అమలు చేయడం జరిగిందని, ఫలితంగా 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిందని తెలిపారు. ప్రజల కోసం వారి జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్యసమరయోదుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలుఅందించాలన్నారు.ఈకార్యక్రమంలో ఎస్పీ తోపాటు ఏఆర్ డిఎస్పీ ఎల్ .శేషాద్రి , రిజర్వు ఇన్స్పెక్టర్స్ శ్రీరాములు, కుమార్, సైబర్ సెల్ ఎస్ఐ రవీంద్రరాజు, ఏఆర్, ఎస్ బి, డి సి ఆర్ బి. సిబ్బంది, డి పి ఓ స్టాఫ్ పాల్గొని పొట్టి శ్రీరాములు గారి చిత్రపటానికి నివాళులర్పించారు.

భామిని మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

ఏపీ రైతు సంఘం డిమాండ్

విశాలాంధ్ర-పాలకొండ/భామిని: వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా భామిని మండలంలో వేల రూపాయలు పెట్టుబడిపెట్టి సాగు చేస్తున్న వరి,ప్రత్తి పంటలు గత రెండు నెలలుగా తీవ్రమైన ఎండలతో పంట పొట్ట దశలో పాలు పడుతున్న దనలో ఎండిపోతుంది. ఎకరా ప్రత్తిపై సుమారు 40 వేలు రూపాయలు పెట్టుబడి పెట్టగా నేడు రెండు మూడు క్వింటాలు కూడా దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు తీవ్రంగా కలత చెందుతున్నారు. ఎకరా వరి పంటకు సుమారు 20 వేలు పెట్టుబడి అయినప్పటికీ ఎండిపోతున్న పంట పశువుల మీద కూడా పనికిరాదని రైతులు తీవ్ర ఆవేదనతో సంఘం ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో సుమారు 9వేల ఎకరాల్లో వరి పంట, 5 వేల ఎకరాల్లో ప్రతి పంట సాగవుగా పూర్తిగా నష్టం జరిగిందని కనుక క్షేత్రస్థాయిలో రెవెన్యూ సంయుక్తంగా సర్వే జరిపి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు వెంకటలక్ష్మి పతినాయుడు కొత్తకోట బాబురావు నాయుడు అప్పలనాయుడు తదితర కమిటీ సభ్యులతో ఆ మండలంలో గల ఎండిపోతున్న వరి ప్రత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ జిల్లాలో కేవలం వర్షాభావ పరిస్థితుల్లో నెలకొన్నాయని తోటపల్లి జంధ్యావతి రావాడ వెంగల్ రాయ రిజర్వాయర్లు ఉన్నప్పటికీ ఆయకట్టు భూముల అంతటికి సాగునీరు అందడం లేదని దీనంతటికీ పాలక పక్షాలు నీటి వనరులపై చూపుతున్న సవతి తల్లి ప్రేమే కారణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎండలు తీవ్రత వల్ల తగినంత నీళ్లు లేకపోవడంతో కొద్దో ,గొప్పో పండిన ప్రత్తి పంట కొనుగోలు కేంద్రం భామిని మండలంలో ఏర్పాటు చేయాలి. వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో హోరం పడుతున్న సమయంలో తగినంత నీటి వాస్తు లేక ధాన్యం గింజ నాణ్యత కోల్పోతుందని అదే సందర్భంలో చూడడానికి పంట పచ్చగా ఉన్న ఉన్న దిగుబడి పైన తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన తెలిపారు. ఈ నెల 5వ తేదీ వరకు జిల్లాలో ఆయా మండలాల్లో పర్యటనలు చేసి ఆరో తేదీ సోమవారం పార్వతీపురం కలెక్టర్ కార్యాలయం వద్ద రైతులతో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని తెలిపారు. ప్రత్తి పంటకు ఎకరాకు 50 వేల రూపాయలు, వరి పంటకు ఎకరాకు 30 వేల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం భామిని మండలం నాయకులు బిడ్డిక ప్రసాదరావు, పోతల బాలరాజు, లోపింటి అప్పారావు, సాసబిల్లి ఉదయ బాబు,కొవ్వాడ మన్మధరావు, రత్నాల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర రాష్ట్ర స్థాపనకు అమరుడైన మహనీయుడు పొట్టి శ్రీరాములు

జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లా పోలీసు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవంను జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో నవంబరు 1న ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ ముఖ్యఅతిధిగా హాజరై, అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాలలు వేసి, పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ మాట్లాడుతూ - మద్రాసు రాష్ట్రం లో తెలుగు ప్రజలకు న్యాయం జరగడం లేదని, తెలుగు మాట్లాడే ప్రజలందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని శ్రీ పొట్టి శ్రీరాములు ఉద్యమించి, ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. 56రోజులు నిరాటంకంగా అమరణ నిరాహార దీక్ష చేపట్టిన పొట్టి శ్రీరాములు, ప్రత్యేక రాష్ట్ర స్థాపనకు తుది శ్వాస విడిచారన్నారు. పొట్టి శ్రీరాములు గారి మరణం తరువాత కేంద్ర ప్రభుత్వం భాషా ప్రయుక్త రాష్ట్రాల ఆవశ్యకతను గుర్తించి, కర్నూల్ రాజధానిగా నవంబరు 1, 1953 ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించడం జరిగిందన్నారు. అనంతరం, రాష్ట్రాల పునః వ్యవస్థీకరణ చట్టంతో హైదరాబాద్ కేంద్రంగా నవంబరు 1, 1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంగా అవతరించిందన్నారు. తెలుగు రాష్ట్రం ఏర్పడుటకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తించి, స్మరించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని ఉందన్నారు. పొట్టి

శ్రీరాములు గాంధేయవాదిగా స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొని, దేశానికి స్వాతంత్ర్యం ఏర్పడేందుకు కూడా కృషి చేసారని జిల్లా అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్ అన్నారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ యూనివర్స్, ఎస్బీ సిఐలు కే.కే.వి. విజయ నాథ్, ఈ.నర్సింహమూర్తి, ఆర్ఐలు ఎన్.గోపాల నాయుడు, రమణమూర్తి, ఆర్ఎస్ఐలు రామకృష్ణ, నీలిమ, నారాయణరావు, ప్రసాదరావు, శ్రీనివాసరావు, రాంబాబు, ఆర్.ఎస్.ఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని, అమర జీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పుష్పాలు సమర్పించి, ఘనంగా నివాళులు అర్పించారు.

జూనియర్ కళాశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

తెర్లాం: మండలంలో జూనియర్ కళాశాలలో ఎంతో ఘనంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు జరిగాయి.... ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ తిరుపతిరావు మరియు

పీఓ తెంటు రామారావు గారు అదేవిధంగా కళాశాల ఇతర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో...

మండల పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములకి నివాళి అర్పించిన ఈ సందర్భంగా ఎంపీడీఓ రామాక్రిష్ణ మాట్లాడుతూ గతంలో ఉమ్మడి మద్రాస్ లో అన్యాయానికి గురవుతున్నామనే భావనతో ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిమాండ్ నెలకొల్పడం జరిగిందని, దానికోసం కీ. శే. పొట్టి శ్రీరాములు గారి ఆత్మార్పణం చేయడం జరిగిందని భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం ఉద్యమంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, 1953 నవంబర్ 1నాడు తెలుగు మాట్లాడే 11 జిల్లాలతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, ఈ 11 జిల్లాలు ఆనాడు మద్రాస్ రాష్ట్రంలో ఉండేవని, ఆ సమయంలో భాషాప్రయుక్త

రాష్ట్రాల డిమాండ్ కూడా ఉండేదని తెలిపడం జరిగింది. ఈ విషయమై కమ్యూనిష్టు పార్టీ అప్పట్లో ఉద్యమం కూడా చేయడం జరిగిందని, ప్రజలు మాట్లాడే బాష ఆధారంగా ఏర్పడిన తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ చరిత్రకెక్కిందని తెలిపారు. మరియు మద్రాసు రాష్ట్రంలో ఉన్న సమయంలో తాము అవహేళనకు గురౌతున్నామని ఆనాడు ఆంధ్రప్రజలు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం కోసం ఉద్యమించడం జరిగిందని, తదుపరి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకు గాను 1952 అక్టోబర్ 19న పొట్టి శ్రీరాములు నిరహార దీక్షను ప్రారంభించారని, పొట్టి శ్రీరాములు దీక్షకు మద్దతు రోజు రోజుకు పెరిగడంతో మద్రాసును వదులుకొంటే ఆంధ్ర రాష్ట్రం సాధ్యమౌతుందని అప్పటి ప్రధాని నెహ్రూ ప్రకటించారని, అందుకు పొట్టి శ్రీరాములు అంగీకరించక తన దీక్షను కొనసాగించారు. 1952 డిసెంబర్ 15న పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసుకున్నారు. దీంతో ఆంధ్రలో పెద్ద ఎత్తున హింస చెలరేగడంతో మద్రాసును మినహాయించి ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు చేస్తామని ప్రధాని నెహ్రూ ప్రకటించారని, వాంచూ నివేధిక ఆధారంగా 1953 మార్చిన ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటును ప్రధాని నెహ్రూ ప్రకటించడం జరిగిందని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంగప్పవలస సర్పంచ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిరస్మరణీయులు పొట్టి శ్రీరాములు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక శ్రీ వాసవీ ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ భవనం వద్ద ఉన్న పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమరజీవి ఫౌండేషన్ అధ్యక్షుడు ఆలవెల్లి శేఖర్ మాట్లాడుతూ 56 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అశువులు బాసిన పొట్టి శ్రీరాములు చిరస్మరణీయుడన్నారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్య క్షుడు కుమ్మరిగుంట శ్రీనివాసరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు జయంతి, వర్ధంతి రోజులను నేటి ప్రభుత్వం రాష్ట్ర పండుగలుగా నిర్వహించడం గొప్ప విషయం అన్నారు. ఉపసభాపతి కోలగట్ల వీరభద్రస్వామి సలహాలు సూచనలతో అనేక సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వాసవీ క్లబ్ అధ్యక్షుడు కందుల సంతోష్ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి సముద్రాల నాగరాజు, మాచర్ల చంద్రశేఖర్ గుప్తా, చెన్నా బుచ్చి జనార్ధనరావు, రాంజీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసిన ఎంఈఓ

భోధనాంశాల పరిశీలన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జాకేరు ప్రాధమికోన్నత పాఠశాలను మండల విద్యాశాఖాధికారి పి.బాలభాష్కరరావు బుధవారం తనిఖీ చేసారు. ముందుగా అన్ని తరగతుల వర్క్ బుక్స్, తెలుగు, ఆంగ్లం చదవడం, రాయడం, చతుర్విధప్రక్రియలు, ఉపాధ్యాయ డైరీలు, టిఎల్ ఎం లెసన్ ప్లాన్, అన్ని రిజిస్టర్ల పరిశీలన చేపట్టారు. అనంతరం విద్యార్థులతో సహపంక్తి భోజనం చేసి మధ్యాహ్న భోజన పధకాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ పరిశీలనలో ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ కి రూ.10వేలు విలువ చేసే కుర్చీలు వితరణ

ప్రారంభించిన న్యాయమూర్తి కుమారి వాణి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట బార్ అసోసియేషన్ సభ్యుడు స్వర్గీయ సింగంపల్లి సత్యనారాయణ జ్ఞాపకర్థం ఆయన కుమారుడు ప్రవీణ్ వితరణగా అందజేసిన రూ. 10వేలు విలువచేసిన కుర్చీలను న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా న్యాయ వాది అయిన తండ్రి జ్ఞాపకార్థం కుర్చీలను అందజేసిన సింగంపల్లి ప్రవీణ్ ను అభినందించారు. కార్యక్రమంలో ఏపీపీ పప్పు కేశవరావు, న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యు. ఎస్.శర్మ, సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, ఎం.దుర్గాప్రసాద్, గేదెల ప్రకాష్, ఎన్ టీవీ దాసు, బి.త్రిమూర్తులు, టీవీఆర్ మూర్తి, బడబళ్ల రామకృష్ణ, బీవీఎస్ రామారావు, వారాది ఈశ్వరరావు, మామిడి చంద్రశేఖర్, ఆర్.సత్యన్నారాయణ, బి.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, బి.వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ, ఎం.అనూరాధ తదితరులు పాల్గొన్నారు. న్యాయవాదిగా సేవలందించిన స్వర్గీయ సింగంపల్లి సత్యనారాయణ సేవలను కొనియాడారు.

రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక మండల పరిషత్ కార్యాలయ భవనం లో బుధవారం సాయంత్రం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చేతుల మీదుగా రైలు ప్రమాదంలో మరణించిన వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వం వారు అందించే చెక్కులు పంపిణీ చేశారు. చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రభుత్వం ఆసరాగా నిలుస్తుంది అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జి భాస్కరరావు, చీపురుపల్లి గరివిడి మండల వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దూరం

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతతో రోగాలకు దూరంగా ఉండొచ్చని ఎంపీడీఓ జి రామారావు చెప్పారు. డయేరియా ప్రబలిన నెల్లిమర్ల మండలం ఎటి అగ్రహారం గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో డయేరియా ప్రబలడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని అన్నారు. గ్రామంలో శానిటేషన్, క్లోరినేషన్ చేయాలని సూచించారు.

రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద వీధి దీపాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి కొండపేట రైల్వే ఓవర్ బ్రిడ్జి కింద విద్యుత్ దీపాలు ఏర్పాటుచేయాలని వైసిపి వార్డు కన్వీనర్ పైల మురళి కోరారు. ఈ మేరకు బుధవారం ఎలక్ట్రిల్ ఎఇకి వినతిపత్రం అందించారు. కొండపేటకు వెళ్లేదారిలో ఇటీవల విద్యుత్ స్తంభాలు కూలిపోవడంతో లైట్లు వెలగడం లేదని చెప్పారు. దీంతో కొండపేట, పాకీపేటకు చెందిన వారు జ్యూట్ మిల్ కి వెళ్లడానికి అవస్థలు పడుతున్నారని చెప్పారు. వెంటనే స్తంభాలను పునరుద్ధరించాలని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ మండలాలలో విద్యుత్ సరఫరా నవంబర్ 2 న గురువారం నిలిపివేయబడుతుందని సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మణరావు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. 220 కె వి సబ స్టేషన్ నిర్వహణ పనుల నిమిత్తం ఉదయం 6 గంటల నుండి సాయంత్ర 6 గంటల వరకు విద్యుత్ సరిపరా నిలిపివేయబడుతుంది తెలిపారు. వినియోగదారులు అందరు ఈ విషయాన్ని గమనించి సహకరించవలసినదిగా కోరారు

వైఎస్ఆర్ ఆరోగ్య బీమా సహాయం అందజేత



విశాలాంధ్ర-జామి: మండలంలోని భీమసింగి పంచా యతీ పరిదిలోని యాతపాలెంకు చెందిన చుక్క నాగ రాజు అనే వ్యక్తి కిడ్నీ సంభందిత వ్యాధితో మరణించాడు. అతనికి డా. వైఎస్ఆర్ భీమా వర్తించడంతో తక్షణ సాయంగా రూ.10వేలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు నగదును బుధవారం మృతుని భార్య ఎల్లమ్మకు భీమసింగి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామారావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకటేష్, సచివాలయ కన్వీనర్లు మజ్జి హరికృష్ణ, శింగారపు అప్పలరాజు, సురేష్ తదితరుల సమక్షంలో అందజేసారు. త్వరలోనే భీమా నగదు ఎల్లమ్మ బ్యాంకు ఖాతాలో జమఅవుతుందని అధికారులు తెలిపారు.

విజయసాయిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి

బీజెపి నియోజకవర్గ సమన్వయకర్త సంజీవి

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: నాసిరకం లిక్కర్ ను అధిక ధరలకు అమ్మి రాష్ట్ర ప్రజలకు అన్నివిధాలా మోసం చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుపాటి పురంధీశ్వరి పైన అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయసాయిరెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని బిజెపి పార్వతీపురం నియోజకవర్గ సమన్వయకర్త సొండి సంజీవి డిమాండ్ చేశారు.స్థానిక ఆర్టీసీ కూడలి వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సమాజానికే కించపరిచే అనుచిత వ్యాఖ్యలను విజయసాయిరెడ్డికి తగదన్నారు.ఈ వ్యాఖ్యలను తక్షణమే వాపసు తీసుకుని బేషరతు క్షమాపణ చెప్పాలన్నారు.ఈ కార్యక్రమంలో కురుపాము, పాలకొండ నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

రైలు ప్రమాద బాధితులను పరామర్శించిన చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్ర

విశాలాంధ్ర-విజయనగరం : రైలు ప్రమాదంలో గాయపడి విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్, వై యస్ ఆర్ సీపీ జల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు కుమార్తె చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరి సహస్ర బుధవారం పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, ఆస్పత్రిలో అందుతున్న చికిత్స వివరాలను బాధితులను అడిగి తెలుసుకున్నారు. వారిని అన్ని విధాలా ప్రభుత్వం అధుకుంటందని , ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులకు పండ్లు, రొట్టెలు, ఓ.ఆర్.ఎస్.లను ఆమె అందజేశారు.

జిందాల్ కంపెనీకై సేకరించినభూములు తిరిగి రైతులు, గిరిజనులకు ఇవ్వాలి : సీపీఎం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: జిందాల్ కర్మాగార నిర్మాణం కోసం భూములిచ్చి 15 ఏళ్లు దాటుతున్న నిర్మాణం చేపట్టనందున ఆ భూములను తిరిగి రైతులు, గిరిజనులకు పంచాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ప్రజా రక్షణ బేరి బస్సు యాత్రలో భాగంగా బుధవారం సాయంత్రం బొడ్డువర చేరుకున్న సిపిఎం బృందానికి గిరిజనులు, యువకులు ఆహ్వానం పలికారు. బొడ్డవరలో సభ ముగిసిన అనంతరం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు జిందాల్ కోసం ఇచ్చిన భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం కోసం 2008లో సుమారు 1150 ఎకరాలు భూమిని తీసుకుని నేటికీ జిందాల్ పరిశ్రమ నిర్మాణం చేపట్టలేదని, కంపెనీ కోసం భూమి ఇచ్చిన వారంతా నేడు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారని, బాక్సైట్ తవ్వితే ఒప్పుకునేందుకు నేటికీ గిరిజనులు సుముఖంగా లేరన్నారు. అలాంటప్పుడు భూమి ఇచ్చిన వారికి తిరిగి భూములు ఇవ్వాలని, లేకుంటే త్వరలో దీనిపై కార్యాచరణ చేసి జిందాల్ భూములపై పోరాటానికి సన్నద్ధమవుతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, సిపిఎం మండల కార్యదర్శి మద్దిల రమణ, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

మత్స్యసంపద అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన మిషన్ ఫింగెర్లింగ్ 2023-2024 పథకంలో భాగంగా మత్స్యసంపదను అభివృద్ధి చేసేందుకుగాను బుధవారం మండ లం పక్కి గ్రామంలో కోనేటి చెరువులో ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మత్స్య శాఖ అధికారులతో కలిసి ఫిగెర్లింగ్ సైజు చేప పిల్లలను చెరువులో విడిచిపెట్టారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న మత్స్యకార భరోసా పథకం ద్వారా నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాల్లో గల చెరువుల్లో చేప పిల్లలు విడుదల చేయుటకు గాను 429796 ఫింగెర్లింగ్ సైజు చేప పిల్లలును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.మత్స్య సంపద అభివృద్ధికి,చేపల ఉత్పత్తిని పెంచడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మత్స్య సంపద అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకారులు, ఇతర ప్రజలు జీవనోపాధి కలిగి

ఆర్థికంగాను మెరుగుపడతారు అన్నారు. మత్స్యకారుల సంక్షేమం కొరకు ఇదివరకే వలలు, వాహనాలు, శీతలీకరణ పెట్టెలు, ఎలక్ట్రానిక్ తూకం యంత్రములు, మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీ, వేణుగోపాల నాయుడు, జడ్పీటీసీ సంకిలి శాంతకుమారి,సర్పంచ్ పైడిరాజు,మత్స్యశాఖ ఏ.ఈ. సంతోష్,బొబ్బిలి మత్స్యశాఖ అధ్యక్షుడు వెంకటరమణ,తదితరులు పాల్గొన్నారు.

3 నుండి 29 వరకూ జిల్లాల్లో ప్రత్యేక గ్రీవెన్సు కార్యక్రమం

హాజరుకానున్న కలెక్టర్ నాగలక్ష్మీ

విశాలాంధ్ర-వంగర: జిల్లాలో ఈ నెల 3 నుంచి 29 వరకూ గ్రీవియన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ తెలిపారు. ఈ మేరకు జిల్లాలో గల మండల అభివృద్ధి అధికారులకు అదేశాలు జారీ చేశారు. బుధ,శుక్రవారాల్లో స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీవోలకు పంపించిన ఉత్తర్వులలో పేర్కొన్నారు. ముందుగా ఈ నెల 3 న వంగర 8న తెర్లాం,10 న సంతకవిటి,15 న బాడంగి,17 న గరివిడి, 22 న వేపాడ, 24 న జామి,29 న బోగాపురం మండలాల్లో ఈ గ్రీవియన్సు కార్య క్రమం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో పర్కొన్నారు.ఆయా రోజుల్లో నిర్వహించ నున్నటువంటి ప్రత్యేక స్పందన కార్యక్రమానికి జిల్లాలో గల అన్ని శాఖల అధికారులు, మండల లెవెల్ అధికారులు పూర్తి సమాచరంతో తప్ప కుండా హాజరు కావాలని జిల్లా కలెక్టర్ నాగలక్ష్మీ అదేశాలు జారీ చేశారు.ఈ ప్రత్యేక గ్రీవియన్స్ కార్య క్రమం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరుగుతుందని, మండలాల్లో గల గ్రామాల్లో ప్రజలకు అందరికీ తెలిసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని మండల అభివృద్ధి అధికారులకు, తహశీల్ దార్ లకు స్పష్టమైన అదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామాల్లో సమస్యలు తదితర వాటిని కలెక్టర్ దృష్టికి తీసు కెల్తే, ఆ సమ్య పరిస్కారం కావటానికి అవకాశం ఉంటుంది. ముందుగా వంగర మండలంలో రానున్న శుక్రవారం నాడు జరగ నున్న కలెక్టర్ గ్రీవియెన్స్ కు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడివో శశి భూషణరావు తెలిపారు. పూర్తి సమాచారంతో మండల స్థాయి అధికారులకు సూచించినట్లు చెప్పారు.

సామాజిక సాధికార యాత్రను విజయవంతం చేయండి

జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచన

విశాలాంధ్ర-జామి : ఈనెల 4వ తేదీన ఎస్.కోటలో జరిగే సామాజిక సాధికార యాత్రను పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని జిల్లా వైసీపీ అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు(చిన్నశ్రీను) నాయకులకు కార్యకర్తలకు సూచించారు. బుధవారం మండలంలోని అలమండ గ్రామంలో మండల ముఖ్య వైసీపీ నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఎస్.కోట నియోజకవర్గానికి సంబంధించిన సామాజిక సాధికార బస్సు యాత్ర జామి మండలంలోని అలమండ నుంచి ప్రారంభమవుతుందని, ఇక్కడ నుంచి కొత్తవలస, వేపాడ, యల్.కోట మండలాల మీదుగా బస్సు యాత్ర ఎస్.కోట చేరుకుంటుందన్నారు. సాయంత్రం ఎన్.కోట పట్టణంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామన్నారు. ఈ యాత్రలో భారీ స్థాయిలో కార్యకర్తలు పాల్గొనాలని సూచించారు. అన్ని గ్రామాల

నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలు తప్పనిసరిగా ఈ యాత్రలో పాల్గొనాలన్నారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర రూట్ మ్యాప్ ను నాయకులకు ఆయన వివరిం చారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు గొర్లెరవికుమార్, సీనియర్ నాయకులు పి.సంజీవి, గుడివాడ రాజేశ్వరరావు, కె.సూరిబాబురాజు, వైస్ ఎంపీపీ గేదెల వెంకటరావు, అలమండ నాయకులు లగుడు దేవుడు పాల్గొన్నారు.

విమానాశ్రయం నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-భోగాపురం: భోగాపురం అంతర్జాతీయ నిర్మాణానికి సంబందించి జీఎంఆర్ సంస్థల చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు ఈ పి సి కాంట్రాక్ట్ సంతకం కార్యక్రమంలో ఎల్అండ్టీ సంస్థ ముఖ్య అధికా రులతో పాల్గొన్నారు. భోగాపురం అంతర్జాతీయ నిర్మాణానికి బుధవారం ఎల్అండ్టి సంస్థ భూమి పూజచేసింది.. కొలువాడ రెవెన్యూ పరిధిలోని భూమి పూజ నిర్వహించారు. ఇప్పటికే ప్రహరీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించి భూమిని జీఎంఆర్ సంస్థ విమానాశ్రయం నిర్మాణపనులను ఎల్ అండ్టి సంస్థకు అప్పజెప్పింది. భూమి పూజ అనంతరం విమానాశ్రయం నిర్మాణానికి సంబంధించిన భూముల్లో చదును చేసే పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటికే దీనికి సంబంధించిన యంత్రాలు కూడా ఎల్ అండ్ టీ సంస్థ సిద్ధం చేసింది. ఈ భూమి పూజలో రెండు సంస్థలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

భీమసింగి చెరకు ధర ఇంకా నిర్ణయించలేదు

సుగర్ ఫ్యాక్టరీ ఎం.డీ విక్టర్ రాజు

విశాలాంధ్ర-జామి: భీమసింగి సహకార చక్కెర కర్మాగారం పరిధిలో పండించే చెరకు కు చెల్లించాల్సిన ధరను ఇప్పటి వరకూ నిర్ణయించలేదని బొబ్బిలిలోని ఉప చెరకు కమిషనర్ జి.వి.వి.సత్యనారాయణ, భీమసింగి చక్కెర కర్మాగారం ఎం.డి. కె.ఆర్. విక్టర్ రాజు తెలిపారు. భీమసింగి, బొబ్బిలి చక్కెర కర్మాగారాలకు సంబం ధించిన చెరకు ధరపై త్వరలో జరిగే జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో నిర్ణయిం తీసుకోవలసి వుందని వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలుగా భీమసింగి కర్మాగారంలో చెరకు గానుగ ఆట నిలిపివేసిన కారణంగా ఈ కర్మాగారం పరిధిలోని చెరకును సంకిలి చక్కెర కర్మాగారానికి తరలిస్తున్నారన్నారు. ఈ సీజనులో కూడా భీమసింగి పరిధిలో పండించిన చెరకును సంకిలి తరలించే ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా ధైర్యం స్థైర్యం

రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ

విశాలాంధ్ర-గుర్ల: సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా ముఖ్యమంత్రి జగన్ మోహన రెడ్డి సామాన్య ప్రజలకు ధైర్యం, స్థైర్యం కల్పించారని రాష్ట్ర విద్యా శాఖా మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఎక్కడా లేదని చెప్పారు. సచివాలయం దేవాలయంతో సమానమని ఆయన పేర్కొన్నారు. గుర్ల మండలం గుజ్జంగివలసలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం సాయంత్రం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ, మనిషికి ఏ కష్టం వచ్చినా గుడికి వెళ్ళి మొక్కుకోవడం అలవాటని, ఇప్పుడు ఏ సమస్య వచ్చినా పరిష్కారం కోసం సచివాలయానికి వెళ్తున్నారని చెప్పారు. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని గొప్ప సచివాలయ వ్యవస్థ మన దగ్గర ఏర్పాటు అయ్యిందని అన్నారు. దీని ద్వారా అర్హత ఉంటే చాలు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఎక్కడా సిఫార్సులకు, అవినీతికి తావు లేకుండా పారదర్శకంగా పాలన జరుగుతోందని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సచివాలయ సిబ్బంది ద్వారా వివరించారు. సమగ్ర భూ సర్వే పథకం వరం లాంటిదని, ప్రభుత్వమే ఉచితంగా భూములను సర్వే చేయించి, హక్కులు కల్పిస్తోందని చెప్పారు. గత ప్రభుత్వం మాదిరిగా మాయ, మోసాలకు పాల్పడకుండా, ఇచ్చిన మాట ప్రకారం మహిళా సంఘాలకు రుణ మాఫీ చేసిన ఘనత ముఖ్యమంత్రి కే దక్కిందని కొనియాడారు. ఫ్యామిలీ ఫిజియన్, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను మంత్రి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా ఇస్తున్న టేక్ హెూమ్ రేషన్లో ఒక లీటరు పాల పేకెట్లు బదులు అర లీటరు పేకెట్లు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ కు సూచించారు. జనవరి నుంచి పింఛనును రూ.3 వేలకు పెంచుతున్నట్లు ప్రకటించారు.జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పార్టీలకు అతీతంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. గుజ్జంగివలస గ్రామమంటే తమకు ఎంతో అభిమానము ఉందని, ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని హామీ ఇచ్చారు.కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ, పరిపాలన ప్రజలకు చేరువ అయ్యేందుకు సచివాలయ వ్యవస్థ దోహద పడిందని చెప్పారు. జిల్లాలో సుమారు 70 శాతం సచివాల యాలను పూర్తి చేశామని

అన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి పారదర్శకంగా అమలు జరుగుతున్నాయని చెప్పారు. అన్ని గ్రామాలకు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అందుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతకుమారి, ఎంపిపి పొట్నూరు ప్రమీల, వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యులు పొట్నూరు సన్యాసినాయుడు, జడ్పిటిసి అప్పలనాయుడు, డి.ఎల్.డి.ఏ. చైర్మెన్ బెల్లాన బంగారునాయుడు, తహశీల్దార్ వి.పద్మావతి, ఎంపిడివో బి.కల్యాణి, సర్పంచ్ పద్మావతి, ఎంపీటీసీ సంధ్యారాణి స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

అధికారులు గైర్హాజరుపై ఎంపీపీ ఆగ్రహం..

పిఆర్డిఇ గైర్హాజరుపై ధ్వజమెత్తిన సభ్యులు

విశాలాంధ్ర-పాచిపెంట: సర్వసభ్య సమావేశానికి పలు శాఖల అధికారులు గైరహాజరపై ఎంపీపీ బి. ప్రమీల ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు గైర్హాజరయితే మండల సర్వసభ్య సమావేశాలు ఎందుకని ఒకంత ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీరాజ్ డిఇ పై ఫల ఆరోపణలు వస్తున్నప్పటికీ మండల సర్వసభ్య సమావేశానికి ఎందుకు గైర్హాజరయ్యారో తెలపాలంటూ సర్పంచులు చెల్లూరు సీతారాం మధ్య సింహాచలం సీతయ్య లచ్చయ్య పట్టు పట్టారు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రమీల అధ్యక్షతన ఎంపీడీవో లక్ష్మి కాంత్ ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధికారులు ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ముందుగా వ్యవసాయ శాఖ పై చర్చ జరిగింది. ఈ సమయంలో ఎంపీటీసీ దండి ఏడుకొండలు మాట్లాడుతూ పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ధరలు పట్టికలు ప్రతి ఆర్ బి కే పరిధిలో ఏర్పాటు చేయాలన్నారు. ఎంపీపీ మాట్లాడుతూ ఖరీఫ్ లో చాలామంది రైతులు ప్రైవేటు వ్యక్తులు సూచించిన మొక్కజొన్న సీడ్ పంటను వేసి పూర్తిస్థాయిలో నష్టపోయారని అలాంటి రైతుల ఫిర్యాదు చేస్తే సంబంధిత యజమానిపై చర్యలు తీసుకోవాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో, గిరిశిఖర ప్రాంతాల నుంచి ఆరోగ్య కేంద్రాలకు మలేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులతో బాధపడుతూ వచ్చిన వారికి ప్రభుత్వం ద్వారా ఉచితంగా భోజన సౌకర్యం కల్పించే



విధంగా ఎంపీపీ తీర్మానం చేయగా సభ్యుల ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. పాచిపెంట జగనన్న లేఅవుట్ పై కూడా ఆరోపణలు వస్తున్నప్పటికీ అధికారులు స్పందించడం పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంపై చర్చ జరిగే సమయంలో పలువురు గిరిజన సర్పంచులు మాట్లాడుతూ బిల్లులు చెల్లింపు విషయంలో ఏఈ డీఈలు తీవ్ర ఇబ్బందుల గురి చేస్తున్నారని, పర్సంటేజ్ ను ముందు ఇస్తే గాని ఎం బుక్ రికార్డింగ్ చేయడం లేదని, నందేదువలసలో 9.5 లక్షల ఎన్.ఆర్.ఈ.జీ.ఎస్ నిధులతో నిర్మాణం చేపట్టిన సిసి రోడ్డు విషయంలో కూడా పర్సంటేజ్ ల రూపంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఇటీవల డీఈ పై కూడా ఫిర్యాదు చేస్తామని, ఆరోపణలు ఎదుర్కొంటున్న డిఈ సమావేశానికి ఎందుకు డుమ్మా కొట్టారని, కాసేపు సభ్యులు వాగ్వాదానికి దిగారు. ఇలాంటి అవినీతి అధికారుల ధన దాహానికి, గిరిజన సర్పంచులు బలైపోతున్నారని, వీరు మూలంగా గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కుంటి పడుతుందన్నారు. జరిగిన పనులకు బిల్లులు చేయాలని అడిగితే కోర్ కటింగ్ చేసి చేస్తామనడం డి ఏ వైఖరికి అర్థం పడుతుందని కేరింగ్

సర్పంచ్ లచ్చయ్య అన్నారు ఎంతవరకు బిల్లులు చెల్లించే వారికి కోర్ కటింగ్ చేసి బిల్లులు చెల్లించారని వాగ్ వివాదానికి దిగారు. ఇలాంటి అధికారులపై చర్యలు తీసుకోవాలని, లేదంటే కోర్టుకు వెళ్తానన్నారు. ఈ విషయంపై ఎంపీపీ తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై ఉన్నతాధికారులు ఎంక్వయిరీ చేసి చర్యలు తీసుకోవాలని సభ ద్వారా తీర్మానం చేశారు. అలాగే పిఏయూ అధికారులు ప్రతి సమావేశానికి కూడా గైరహాజరవుతున్నారని, మండలంలో సుమారు ఆ శాఖ ఆధ్వర్యంలో 100 కోట్లతో నిర్మాణ పనులు జరుగుతున్నాయని పనులు పర్యవేక్షించడానికి కూడా అధికారులు వెళ్లడం లేదని ఎంపీటీసీలు ఆరోపించారు. తరచు గైర్హాజరవుతున్న అధికారులకు వెంటనే నోటీసులు ఇచ్చి రెండు రోజుల్లో సమాధానం చెప్పాలని, లేకుంటే వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేస్తానని ఎంపీపీ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఇలాంటి సభలు ఏర్పాటు చేస్తే వీటికి అధికారులు గైర్హాజరవ్వడం చాలా బాధాకరమన్నారు. అధికారులు ఇలా గైర్హాజరవుతుంటే ప్రజా ప్రతినిధులు వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సింహాచలం, వైస్ ఎంపీపీ ఎంపీడీవో లక్ష్మి కాంత్ పాల్గొన్నారు

30 వేల మందికి జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు : ఎమ్మెల్యే జోగారావు

విశాలాంధ్ర - సీతానగరం : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రాష్ట్రంలోని ప్రజలఆరోగ్యంకోసం, రోగులబాధలు నివారణకోసం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంవరమని, దీనికి అన్ని సచివాలయంలలో,గ్రామాల్లో అనూహ్య స్పందన లభించిందని ఎమ్మెల్యే అలజింగి. జోగారావు తెలిపారు. బుధవారం నాడు మండలంలోని సూరమ్మపేట గ్రామ సచివాలయంలో జగనన్న అరోగ్య సురక్ష ముగింపు కార్యక్రమాన్ని సచివాలయంలో ఏర్పాటు శిబిరాన్ని ఆయన సందర్శన చేశారు.శిబిరంవద్ద ఏర్పాటు చేసిన కౌంటర్ల ద్వారా అందజేస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. సూరమ్మపేట, మరిపి వలస, చిన్నా రాయుడుపేట గ్రామాలకుచెందిన 490మందికి పైగా రోగులకు వైద్యసేవలు అందించామని వైద్యులు తెలిపారు.జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు, రోగులు పెద్ద ఎత్తున పాల్గొని సద్వినియోగం చేసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవడం, నియోజక వర్గంలోని మూడు మండలాల్లోని గత నెల రోజులుగా జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా దాదాపు 30వేల మందికి ఆరోగ్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. స్థానిక వైద్యులు, స్పెషలిస్ట్ వైద్యులు, అన్ని శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు సంపూర్ణ సహకారం వల్ల విజయ వంతంగా జరిగిందన్నారు. ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించిన రాష్ట్ర ముఖ్యమంత్రి

వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి నియోజక వర్గం నుంచి కృతజ్ఞతలు తెలిపారు.అన్ని రోజులు జగనన్న ఆరోగ్య సురక్షలో పాల్గొని పర్యవేక్షణ చేసి ఎప్పటికప్పుడు సలహాలు ఇచ్చి విజయవంతం చేసిన ఎమ్మెల్యే జోగారావుకు స్థానిక ప్రజా ప్రతినిధులు,కన్వీనర్లు,వాలంటీర్లు, గృహ సారథులు ఘనంగా సత్కరించారు.డ్వామా పిడి రామచంద్ర రావు కూడా సందర్శన చేశారు. ఈవైద్య వైద్య శిబిరంలో సీతానగరం, పెదంకలం పిహెచ్‌సి వైద్యులు, శిరీష, ఉషారాణి రాధాకాంత్, ప్రభుతేజా, స్పెషలిస్టు వైద్యులు స్నిగ్ధా, భరద్వాజ్, రెడ్డి శిరీష దుర్గాప్రసాద్, సాగరిక, రమేష్‌లు తనిఖీలు నిర్వహించి మందులను అందజేశారు. కొంత మందిని పెద్ద ఆసుపత్రులకు రిఫర్ కూడా చేశారు. 104 సిబ్బంది ప్రసాద్, ఈశ్వర రావులు కూడా పాల్గొని సేవలు అందించారు .అంగన్వాడీ సిబ్బంది పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేయగా ఐసీడీఎస్ పిఓ సుగుణ, సూపర్ వైజర్ సురేఖ పాల్గొని దీనివల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. పోషకాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా వాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములునాయుడు, జడ్పీటీసీ మామిడి బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు,తహశీల్దార్ పరిపాలన అధికారి ప్రసాద్,ఎంఈఓలు సూరి దేముడు, వెంకటరమణ, ఆర్ ఐ శ్రీనివాసరావు,సిహెచ్ఓ ఎస్వీరమణ, హెచ్ వి భవానీ, హెచ్ఎస్ శర్మ, సర్పంచ్ చిట్టపులి అప్పల నరసమ్మ సాంబన్నదొర, ఎంపీటీసీ బొంగు వరలక్ష్మి,ఉప సర్పంచ్ ఎస్ ఈశ్వరరావు, సహకార సంఘం అధ్యక్షుడు మండల త్రినాథ, స్వామినాయుడు, నాగరాజు, పకీరు నాయుడు, బొంగు శివున్నాయుడు, హేమసుందర నారాయణ, మండల నాయకులు ఈశ్వర నారాయణా, సూర్యనారాయణ, గోపాల్, సూరమ్మపేట సచివాలయం సిబ్బందిసెక్రటరీకె సంతోష్, విఆర్ఓ పానీగ్రహి, వెంకటరావు, హరిగోపాల్, దామోదర్, క్రాంతికుమార్, శివ, సురేష్, ఆమని, నీలిమ, గౌరమ్మ, శ్రావణితో పాటు వివిధ సచివాలయంల సిబ్బంది, వైద్య సిబ్బంది, వాలంటీర్లు, ఆశాకార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గత నెల రోజులుగా కార్యక్రమాన్ని తహశీల్దార్ ఎన్వీ రమణ, ఎంపిడిఓ మహేష్ రెడ్డి , పరిపాలన అధికారి ప్రసాద్, ఈఓ పిఆర్డీ వర్మలతో పాటు అన్నిశాఖల అధికారులు, వైద్యులు కష్టపడి పనిచేసి విజయ వంతం చేశారు. కాకపోతే సచివాలయం కార్య దర్శులకు, సర్పంచులకు ప్రభుత్వం మంజూరు చేసిన 20 వేల రూపాయలు చాలక మరో 20వేల రూపాయలు అప్పుజేసి కార్యక్రమాన్ని నిర్వహించా మన్నారు. దీనిపై జిల్లా అధికార యంత్రాంగం దృష్టి పెట్టి మిగిలిన డబ్బులు ఇచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని పలువురు సర్పంచులు తెలిపారు.

జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు ఏర్పాటు చేయండి

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి ఏడాదిన్నర కావస్తున్నా నేటికీ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసు జిల్లాలో ఏర్పాటు చేయకపోవడం దారుణమని గిరిజన సమాఖ్య, గిరిజనాభ్యుదయ సంఘాల నాయకులు దుక్క సీతారాం (జిఎస్) ఆరిక చంద్రశేఖర్ (ఎజిఎఎస్) అన్నారు. ఎంప్లాయిమెంట్ ఎక్కడ చేయించుకోవాలో తెలియక విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చెయ్యాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను కలసి వినతిపత్రం అందచేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

జిల్లా కేంద్ర ఆసుపత్రి పరిపాలన అధికారిగా శ్రీధర్

విశాలాంధ్ర - బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా కేంద్ర ఆసుపత్రి పరిపాలన అధికారి ఏవో గా మీసాల శ్రీధర్ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదే ఆసుపత్రిలో సూపరింటెంట్ గా పనిచేస్తూ ఆసు పత్రిలో అన్ని విభాగాలపై పూర్తి అవగాహన ఉన్న శ్రీధర్, పదోన్నతిపై ఏవో గా రావడం సంతోషించ దగ్గ విషయమని ఆసుపత్రి సూపరిండెంట్ బి. వాగ్దేవి అన్నారు. ఈయన నియా మకం పట్ల వైద్యులు సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

ధర్మవరం ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి పండుగ, విజయనగరం ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన సైన్స్ ఫెయిర్ (జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన) లో ధర్మవరం విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ కు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించినట్లు ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.ఉమామహేశ్వరరావు, గైడ్ టీచర్ పొట్నూరు శివాజీ, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ తమ్మినాన రాజేష్ తెలిపారు. ఈ సందర్భంగా వారు బుధవారం మాట్లాడుతూ ఈ నెల 29, 30, 31 తేదీల్లో శ్రీపైడితల్లి అమ్మవారి పండుగ, విజయనగరం ఉత్సవాలు సందర్భంగా నిర్వహించిన జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థులు దేగల పృథ్వి నాయుడు, సేసెట్టి భాను ప్రకాష్ ప్రదర్శించిన "స్మార్ట్ ట్రాలీ ఫర్ డిజేబుల్ పర్సన్స్" "స్మార్ట్ ఫ్లాగ్ హెూస్టింగ్" అనే ప్రాజెక్టుకు జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్స్‌గా వ్యవహరించిన ధర్మవరం హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ అధ్యాపకులు పొట్నూరు శివాజీ, జిల్లా అకడమిక్ కోఆర్డినేటర్ తమ్మినాన రాజేష్ , తొమ్మిదో తరగతి విద్యార్థులు సేసెట్టి భానుప్రకాష్, దేగల పృథ్వినాయుడులను హైస్కూల్ ప్లస్ ఫర్ గర్ల్స్ అధ్యాపకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రహీమ్ షేక్ లాల్, మూర్తి (సతీష్), సురేంద్రనాథ్, మంజుల, పాఠశాల ఉపాధ్యాయుల కార్యదర్శి విఈ సత్యనారాయణ, ఉపాధ్యాయులు పొట్నూరు శ్రీరాములు, మూర్తి, ఎల్ వి సత్యనారాయణ, చలం, ఈశ్వరరావు, పేరినాయుడు, సఖినా, హరి, ఏవి స్వామి, సరస్వతి, లోకిరెడ్డి కృష్ణ, కిరణ్, నారాయణరావు, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో అంగన్వాడీ స్టాళ్లు ఏర్పాటు

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది ఆధ్వర్యంలో అంగన్వాడీ స్టాళ్లను ఏర్పాటుచేసి అందరికీ పోషకాహార విలువలుగూర్చి తెలియజేయడం మంచి కార్యక్రమమని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఐసీడీఎస్ పిఓ సిహెచ్, సుగుణకుమారి, సూపర్ వైజర్లుపూర్ణిమా, సురేఖలతో పాటు మండలంలోని 21గ్రామ సచివాలయంలలో ఏర్పాటు చేసిన స్టాళ్ళ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. బుదవారం సూరమ్మపేట గ్రామసచివాలయంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఏర్పాటు చేసిన ముగింపు స్టాల్ వద్ద జ్యోతి ప్రజ్వలన చేసి, ఇద్దరు చిన్నారులకు ఆయన చేతుల మీదుగా అక్షరభ్యాసం నిర్వహించి వారికి ఆశీస్సులు తెలిపారు. గర్భవతులు, బాలింతలు మరియు ఆరు సంవత్సరాల లోపు పిల్లలలో రక్త హీనత, లోపపోషన నివారణకు పోషకాహార ప్రదర్శన చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో లభించేమునగాకు ప్రత్యేకత గూర్చి వివరించారు. గ్రామాల్లోని లభించే కూరగాయలు, ఆకుకూరలు వల్ల కలిగే ఉపయోగాలు వివరించారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా మెరుగైన పోషకాహార సేవలు అందించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నాపల్లెంలో సమతుల్య ఆహారం గూర్చి చెబుతూ పలురకాల పోషకాహారాలు, కూరగాయలు పళ్ళు ప్రదర్శనను నిర్వహించారు. జిల్లా కలెక్టర్, జిల్లా పిడి అదేశాలు సూచనలు సలహాల మేరకు అన్ని సచివాలయంలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల్లో స్టాళ్ళ విజయవంతంగా నిర్వహించామని ఐసిడిఎస్ పిఓ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిది బలగ శ్రీరాములునాయుడు, జడ్పీటీసీ మామిడి బాబ్జి, మండల వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు బొంగు చిట్టిరాజు, తహశీల్దార్ ఎన్వీ రమన, ఈఓపిఆర్డీ వర్మ,సర్పంచ్ చిట్టపులి అప్పల నరసమ్మ సాంబన్నదొర, ఎంపీటీసీ బొంగు వరలక్ష్మి, ఉపసర్పంచ్ ఎస్ ఈశ్వరరావు, సహకార సంఘం అధ్యక్షుడు మండల త్రినాథ, స్వామినాయుడు, నాగరాజు, పకీరునాయుడు, బొంగు శివున్నాయుడు, హేమసుందరనారాయణ, అంగన్వాడి కార్యకర్తలు కల్యాణీ, సులోచన, మంజు, సహాయకులు సరస్వతి, గంగ, దుర్గ తల్లులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

లేఅవుట్‌లలో అప్రోచ్ రోడ్లు, బోర్లు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : మంజూరైన ఇండ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని, లేఔట్లలో నిర్మాణాలకు కావలసిన మౌళిక వసతులు కల్పించాలని ఐటిడిఎ ప్రోజెక్టు అధికారి సి. విష్ణుచరణ్ తెలిపారు. బుధవారం సాలూరు మండలం నెలిపర్తి వద్ద గల జగనన్న పట్టణ గృహ లేఅవుట్ ను ప్రోజెక్టు అధికారి పరిశీలించారు. లేఔట్ లో అప్రోచ్ రోడ్ల నిర్మాణం, నీటి సదుపాయం కొరకు బోర్ వెల్ డ్రిల్లింగు పనులను వెంటనే మొదలు పెట్టాలని పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా అధికారులను ఆదేశించారు.అనంతరం పాచిపెంట మండలం పి.కోనవలసలో గల ఎపిటి డబ్ల్యుఆర్.జె.సి బాలికల కాలేజీని తనిఖీ చేసారు. తరగతి గదులు, వంటగది, బోజనాల హాలు పరిశీలించారు. స్టాకు రూం, రిజిస్టర్లు తనిఖీ చేసారు. హాస్టల్ లో గల వసతులు, సమస్యల గూర్చి విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు ఎటువంటి యిబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని హాస్టల్ వార్డెన్ కు, మంచి విద్యను అందించాలని ఉపాధ్యాయులను అదేశించారు. పర్యటన కార్యక్రమంలో సాలూరు మునిసిపల్ అధికారులు, ఇంజనీరింగు, గ్రామీణ నీటిసరఫరా విభాగం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలి

విశాలాంధ్ర - బెలగాం : టీకా కార్యక్రమంలో నిర్దేశించిన మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డిఐఓ) డాక్టర్ టి. జగన్మోహనరావు సూచించారు. ఈ మేరకు ఆయన మండలంలో పుట్టూరు, పెదబొండపల్లి, చినబొండపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బంది నిర్వహించిన టీకా కార్యక్రమాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంతమంది చిన్నారులు, గర్భిణీలకు టీకా వేస్తున్నదీ ఆర్సిహెచ్ రిజిస్టర్లు, టీకా అర్హుల జాబితా పరిశీలించారు. టీకా కార్డులో గడువు తేదీలను పరిశీలించారు. అత్యవసర మందులు కిట్ (ఎఈఎఫ్ఐ), సిరంజీలు, హబ్ కట్టర్, వ్యాక్సిన్ ను టీకా కేంద్రంలో తనిఖీ చేశారు. టీకా వేయదానికి ముందురోజు తెలియజేస్తున్నారా అని తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయం

విశాలాంధ్ర - పార్వతీపురం : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పాటు అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగఫలితమని, దేశంలో అనేక బాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పొట్టి శ్రీరాములు ఆద్యుడని జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. నవంబరు 1వ తేది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణను పురష్కరించుకొని బుధవారం జిల్లా కలెక్టరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్రావతరణ ఉత్సవాలకు జిల్లా కలెక్టరు ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం సిద్దించే నాటికి దేశంలో అనేక సంస్థానాలు, రాజ్యాలు ఉన్నాయని వాటినన్నింటిని ఏకంచేసిన పిదప పరిపాలన సౌలభ్యం కొరకు రాష్టాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఒకే బాష మాట్లాడే వారికి ఒకే రాష్ట్రం ఉండాలని, వివక్షకు గురవుతున్న తెలుగువారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుచేయాలని అమరజీవి పొట్టి శ్రీరాములు గాంధేయవాదంతో ఆరువారాల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణత్యాగం చేసారన్నారు. వారి త్యాగఫలితంగా ప్రజాగ్రహానికి తలొగ్గి కేంద్ర ప్రభుత్వం భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కమిటీ వేసి అమలు చేయడం జరిగిందని, 1956 నవంబరు 1వ తేదీన ఆంధ్రప్రదేశ్ ఏర్పాటు జరిగిందని తెలిపారు. జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగులు దేశం, రాష్ట్ర అభివృద్ధికి కృషిచేయాలని, ప్రజల కోసం వారి జీవితాన్ని త్యాగం చేసిన పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్య సమయయోదుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకటరావు, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి ఆర్. ఉమా మహేశ్వరరావు, జిల్లా వైద్యాధికారి బి.జగన్నాధరావు, డిఐపిఆర్ఓ ఎల్. రమేష్, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటి పర్యటన

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం : అటల్ టంకరింగ్ ల్యాబ్ పధకం ద్వారా పాఠశాలలకు కేటాయించిన నిధులు, పరికరాల పరిశీలనకు ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటి పార్వతీపురం మన్యం జిల్లాలో నవంబరు 8,9 తేదీలలో పర్యటించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ తెలిపారు. అటల్ టింకరింగ్ ల్యాబ్ పథకం ద్వారా నిధులు కేటాయించడంమే కాకుండా విలువైన 3డి ప్రింటర్, ఇంజినీరింగ్ పరికరాలు వంటి వాటిని కేటాయించడం జరిగిందని, ప్రభుత్వం ఇస్తున్న నిధులు ఎంతవరకు వినియోగం లోకి వస్తున్నాయి, మెంటార్ సంస్థలు ఎలా విద్యార్దులను తీర్చిదిద్దుతున్నారు, పాఠశాల స్థాయిలో అటల్ టి%శీ%కరింగ్ ప్రయోగశాలలు అమలు తీరు ఎలా ఉంది, రికార్డుల నిర్వహణను పరిలించడానికి పాఠశాల విద్యా కమిషనర్, సమగ్ర శిక్షా, రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్.సి.ఈ.ఆర్.టి), కొంత మంది డిఎస్ఓ లతో కూడిన రాష్ట్ర స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటిని వేయడం జరిగిందని వారు జిల్లాలో పర్యటిస్తారని తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పరిదిలో అటల్ టింకరింగ్ (ఎటిఎల్) ప్రయోగశాలలు 24 ఉన్నాయని, వీటితో పాటు (ఎస్టీఈఎం) సైన్సు టెక్నాలజీ ఇంజీరింగ్ అండ్ మాథ్స్) ప్రయోగశాలలు-3, ప్రతీ ఉన్నత పాఠశాలలో సైన్సు ప్రయోగశాలలు ఉన్నాయని, పార్వతీపురం మన్యం జిల్లా పరిదిలో రెండు రోజుల పర్యటనలో భాగంగా ఎటిఎల్ఎస్ తో పాటు సాధారణ ప్రయోగశాలలు కూడా సందర్శించి ప్రయోగాలు అమలు జరుగతున్న తీరును రాష్ట్ర బృందం పరిలిస్తుందని కావున ప్రయోగశాలలు, రికార్డు నిర్వహణ ఉండేలా ప్రధానోపాధ్యాయులు, ల్యాబ్ ఇంచార్జిలు చర్యలు తీసుకోవాలని, అన్ని రకాల రికార్డులతో అందుబాటులో ఉండాలని జిల్లా విద్యాశాఖధికారి ఆదేశించారు.

సీనియర్ పాత్రికేయులు సత్యన్నారాయణ పాణిగ్రహీకి పితృవియోగం

విశాలాంధ్ర - పార్వతీపురం : సీనియర్ పాత్రికేయులు, సీనియర్ న్యాయవాది, నాగావళి ఎక్స్ ప్రెస్ దినపత్రిక సంపాదకులు సత్యన్నారాయణ పాణిగ్రహీకి పితృవియోగం వార్త పట్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ అదపాక సత్యా రావు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేసారు. సత్యన్నారాయణ పాణిగ్రహీ తండ్రి నరసింహ పాణిగ్రహీ (75) బుధవారం మధ్యాహ్నం చినమేరంగిలో హఠాత్తుగా కన్ను మూసారు. నరసింహ మృతి సత్యన్నారాయణ పాణిగ్రహీ కుటుంబానికి తీరని లోటని సత్యారావు పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు.

ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో ఆర్బీకే సిబ్బంది అనుసంధానం కావాలి

విశాలాంధ్ర - వేపాడ : ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది అను సంధానమై రైతులందరిని ప్రకృతి వ్యవసాయం వైపు దృష్టి సారించేలా చైతన్యపర్చాలని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ఆనందరావు అన్నారు. మండలంలోని సోంపురం రైతుభరోసా కేంద్రంలో ఏడిఏ విజయ అధ్యక్షతన బుధవారం ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆర్బీకే సిబ్బందికి అనుసంధాన సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన వేపాడ మండలాన్ని ప్రకృతి వ్యవసాయం మోడల్ మండలంగా మన విజయనగరం జిల్లాలోనే ప్రధమంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఆర్బీకే సిబ్బంది ప్రకృతి వ్యవసాయ సిబ్బందిని కలుపుకొని రైతులకు ప్రకృతి వ్యవసాయం పైన పూర్తి స్థాయి అవగాహన కల్పించి వారికి శిక్షణ సమావేశాలు నిర్వహించాలాన్నారు. మన ప్రకృతి వ్యవసాయ విభాగం వ్యవసాయ శాఖ విభాగం కలిసి పనిచేసి రైతులకు వ్యవసాయ పనుల్లో పెట్టుబడులు తగ్గించి నాణ్యమైన పంట పండే విధంగా శిక్షణలు సూచనలు ఇవ్వాలని రైతులు 365 రోజులు పంటలు పండించే విధంగా సంసిద్ధంగా తయారు చేయాలని వ్యవసాయానికి పెట్టే ఖర్చుని తగ్గించి అధిక దిగుబడును వచ్చే విధంగా అధిక ఆదాయం సంపాదించుకునే విధంగా రైతులను తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు. మండలంలోని రైతులందరినీ మూడు సంవత్సరాల్లో పూర్తిస్థాయిలో ప్రకృతి వ్యవసాయం వైపు మార్చాలని సూచించారు. ఏడిఏ విజయ మాట్లాడుతూ ప్రతి రైతును ఆర్బీకేకు అనుసంధానం చేయడం జరిగిందని తప్పనిసరిగా ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేయాలని ప్రకృతి వ్యవసాయం గురించి తెలియజేసిన తర్వాతే మిగతా కార్యక్రమాలు ప్రారంబించాలని ఆర్బీకే సిబ్బందికి ఆదేశాలు జారీచేసారు. ఈ కార్యక్రమంలో ఎంఎంటి. ఎంటిఎస్, విఏఏలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపిక

విశాలాంధ్ర - కొత్తవలస : స్కై మార్షల్ ఆర్ట్స్ 37వ జాతీయ స్థాయి పోటీలకు కొత్తవలస విద్యార్దులు ఎంపికైనట్లు కోచ్ ఎం.త్రినాదరావు తెలిపారు. మండలానికి చెందిన ప్రసాద్, గోపిరాము, కుసుమ శ్రీ, వెంకట లక్ష్మి, లలితా కామేశ్వరి లు ఎంపికై నట్లు త్రినాద్ తెలిపారు. ఈ నెల 6, 7, 8 తేదీల్లో గోవాలో జరుగు 37వ జాతీయ స్థాయి మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో సత్తా చాటుతారని ఆయన తెలిపారు.

పోస్టల్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - కురుపాం : పార్వతీపురం పోస్టల్ సూపరేండెంట్, సబ్డి డివిజనల్ అసిస్టెంట్ సూపరేండెంట్ ఆదర్యంలో కురుపాం మండలంలో వివిధ పాఠశాలలు గిరిజన సంక్షేమ పాఠశాలు ఉదయపురం, లంకజోడు జిల్లా పరిషత్ కురుపాం, మోడల్ పాఠశాల కురుపాం విద్యార్థులు వ్యాసరసన పోటీలు కు హాజరయ్యారు. ఈ పోటీలో ఇప్పటికి సుమారుగా 150 మంది స్టూడెంట్స్ పాల్గొన్నారు. 5 వ తరగతి నుండి డిగ్రీ వరకు చదువుతున్న స్టూడెంట్స్ రాయవచ్చు ప్రైజ్ మని బహుమతుల 4 మొదటి బహుమతులు! ఒక్కక్కరికి బహుమతి నగదు లక్ష రూపాయలు 4 రెండవ బహుమతి నగదు ఒక్కొక్కరికి.. 50000/- మూడవ బహుమతి నగదు ఒక్కొక్కరికి.25000/- ఈ పోటీ వల్ల స్టూడెంట్స్ నైపుణ్యం పెరుగుతూ ఒత్తిడి తగ్గుతుంది అని చాలా పాఠశాలలు టీచర్స్ /స్టూడెంట్స్ చాలా సంతోషంగా పాల్గొన్నారు! పైన వ్యాసరచన పోటీలు ఇంకా చాలా పాఠశాలలు స్టూడెంట్స్ రాయటానికి సిద్ధంగా ఉన్నారు ఇంకా ఆసక్తి గల స్టూడెంట్స్ తో టీచర్స్ వ్యాసరసన రాయించాలి అనుకుంటే వి.తిరుపతి (బ్రాంచ్ పోస్ట్ మాస్టర్) 7827028017, 8331804640 కురుపాం మండలం సంప్రదించాలని సూచించారు.

ఓటరు నమోదు, సవరణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు

విశాలాంధ్ర - పార్వతీపురం : ఓటరు నమోదు, సవరణ కొరకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం జిల్లా కలెక్టరు చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టరు మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుకు, అభ్యంతరాల స్వీకరణకు నవంబరు 4,5 తేదీలు, డిశంబరు 3,4 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని ఇప్పటివరకు ఓటరుగా నమోదు చేసుకోనివారు, జనవరి 1వ తేది నాటికి 18 సంవత్సరాలు పూర్తవుతున్న యువతీ, యువకులు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. అక్టోబరు 27వ తేదీన విడుదల చేసిన ఓటరు జాబితా ముసాయిదాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ముసాయిదా ప్రతులను సంబంధిత పోలింగు కేంద్రం వద్ద, బూత్ లెవల్ అధికారి, మండల తహశీల్దారు, కలెక్టరు కార్యలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని, ఓటర్ లిస్టులను ప్రతి ఒక్కరు పరిశీలించుకోవాలని వాటిలో తొలగింపులు, చేర్పులు వంటి అభ్యంతరాలుంటే తెలియ జేయాలన్నారు. ఫారం 7, 8 ద్వారా వాటిని సరిచేసుకునే అవకాశం ఉందని, ముసాయిదాలోని క్లైములు, అభ్యంతరాలను అక్టోబర్ 27 నుండి డిసెంబరు 9 వరకు స్వీకరించడం జరుగు తుందన్నారు. డిసెంబరు 26 నాటికి వాటిని పరిష్కరించడం జరుగుతుందని, 2024 జనవరి 5న తుది జాబితా ప్రచురణ సిద్ధం అవుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలో ఓటరు జాబితా తయారీ ప్రక్రియ పట్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు సంతృప్తి వ్యక్తంచేసారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అదికారి జె. వెంకటరావు, తెలుగుదేశం పార్టీ ప్రతినిధి జి. వెంకటనాయుడు, వైఎస్ఆర్ సిపి పార్టీ ప్రతినిధి సి. ఉమామహేశ్వరరావు, సిపిఐ (ఎం) ప్రతినిధి రెడ్డి వేణు, బిఎస్పి పార్టీ ప్రతినిధి పి. సుధీర్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి పి. శ్రీనివాసు, లోక్ సత్తా పార్టీ ప్రతినిధి అల్లం ప్రభాకరరావు పాల్గొన్నారు.

న్యాయవాద వృత్తిలో రాణించి సమాజానికి విలువైన సేవలు అందించాలి

న్యాయమూర్తి కుమారి ఎస్.వాణి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : చట్టం కేవలం సామాజిక నియంత్రణ సాధనం మాత్రమే కాదని, సామాజిక మార్పుకు సాధనం అని న్యాయమూర్తి కుమారి సబ్బవరపు వాణి అన్నారు. ఎస్.కోట జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదుల సంఘ అధ్యక్ష, కార్యదర్శి అల్లు సత్యాజీ, డబ్ల్యు.ఎస్.శర్మ నేతృత్వంలో కొత్తగా జూనియర్ న్యాయవాదులగా చేరిన అల్లు అవినాష్, సాయిలను న్యాయ మూర్తి వాణికి పరిచయ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ఆధునిక అభివృద్ధి చెందుతున్న సమాజంలో చట్టం, న్యాయ విద్య మరియు అభివృద్ధి పరస్పర సంబంధం కలిగి ఉన్నాయన్నారు. నిరంతరం చట్టాలు గురించి అధ్యయనం చేయడం, తెలుసుకోవడంతో పాటుగా నమ్ముకున్న కక్షిదారులకు పూర్తిగా న్యాయం చేసేందుకు పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీ పప్పు కేశవరావు, సీనియర్ న్యాయవాదులు జి.సూరి దేముడు, ఎం.దుర్గాప్రసాద్, ఎన్.టి.వి.దాసు, గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, మామిడి చంద్రశేఖర్, బడబళ్ల రామకృష్ణ, వారాది ఈశ్వరరావు, టీవీఆర్ మూర్తి, బీవీఎస్ రామారావు, ఆర్.సత్యనారాయణ, బి.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, సీహెచ్. ఆర్.ఏ.నాయుడు, ఎం.అనూరాధ, బి.వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ, ఎం.దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానంలో వంగర విద్యార్థులు

విశాలాంధ్ర - వంగర : వారధి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆన్లైన్ ద్వారా సెప్టెంబర్ 27న నిర్వహించిన వ్యాసరచన పోటీలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రంలో వంగర హై స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానం లో నిలిచారు.ఈ మేరకు జెడ్ పీ ఉన్నత పాటశాల హెడ్ మాస్టర్ ముద్దాడ రమణమ్మ తెలిపారు.ఆన్లైన్ లో జరిపిన ఈ పోటీల్లో రాష్ట్వ్యాప్తంగా విద్యార్థులు పాల్గొనగా,అందులో వంగర విద్యార్థులు 10వ తరగతి విద్యార్థులు పాలవలస యామిని, గొట్టాపు గుణ శ్రీ, శివాపు దీప్తి లు వ్యాసరచన పోటీల్లో ప్రథమ స్థానం సాధించి, రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి నీ కైవసం చేసుకున్నారు. ఈ విద్యార్థులు మొదటి స్థాయిలో నిలిచి నందు వీరికి ఒక్కొక్క రికి 12 వేల రూపాయల వంతున, ముగ్గురు విద్యార్థులకు రూ. 36000లు వారధిఫౌండేషన్ వారు అంద జేసినట్లు హెచ్ ఎం.రమణమ్మ చెప్పారు. అంతే కాకుండా అంతేకాకుండా వీరికి మెడిల్సు, సర్టిఫై కేట్ల ను అందజేశారు. మొత్తం 36000 క్యాష్ ఈ పోటీలకు పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు శ్రీ ఎస్. జయకృష్ణ గైడ్ టీచరుగా వ్యవహరించారు. విద్యార్థులకు పాఠశాల ప్రధానో పాధ్యాయులు రమణమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది అభినందనలు తెలియజేస్తూ, మీరు మరెన్నో పోటీలలో పాల్గొని స్కూల్‌కి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను హై స్కూల్ ఉపాద్యాయ సిబ్బంది కోరారు.

చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించిన ఈఓపిఆర్డీ

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలోని సూరమ్మపేట గ్రామపంచాయతీలో గల చెత్త సంపద కేంద్రాన్ని ఈఓపిఆర్డీ వర్మ బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పొడి, తడి చెత్తల గూర్చి ఆరాతీశారు. చెత్త సేకరణపై గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి పంచాయతీని శుభ్రంగా ఉంచాలని కోరారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలోసర్పంచ్ అప్పల నరసమ్మ, సెక్రెటరీ సంతోష్, సిబ్బంది పాల్గొన్నారు.

పార్వతీపురంలో ఇన్నోవేషన్ హబ్.....జిల్లాకు నీతి ఆయోగ్ మరో ప్రశంస

విశాలాంధ్ర - పార్వతీపురం/బెలగాం : పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం అనుభవపూర్వక అభ్యాస కేంద్రంగా ఇన్నోవేషన్ హబ్ ప్రతిపాదనను నీతి ఆయోగ్ ప్రశంసించింది. మౌలిక సదుపాయాల రంగంలో పనులు విజయవంతంగా పూర్తి చేయడం, దూర ప్రాంతాల్లో మొబైల్ టవర్లను ఏర్పాటు చేయడంపై అంతకుముందు నీతి ఆయోగ్ ప్రశంసించింది. పార్వతీపురం మన్యం జిల్లాలో నీతి ఆయోగ్ ఎక్స్ టర్నల్ ఎయిడెడ్ ప్రాజెక్ట్ కింద ఇన్నోవేషన్ హబ్, అనుభవపూర్వక అభ్యాస కేంద్రాన్ని ఏర్పాటు చేయబోతున్నట్లు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బివిఆర్ సుబ్రహ్మణ్యం బుధవారం ఆశావాహ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆశావాహ జిల్లాల కింద పార్వతీపురం మన్యం జిల్లాకు నీతి ఆయోగ్ ప్రోత్సాహకంగా రూ.3 కోట్లు మంజూరు చేసి ప్రతిపాదనలు సమర్పించాలని కోరింది. పార్వతీపురంలో అనుభవపూర్వక అభ్యాస కేంద్రమైన ఇన్నోవేషన్ హబ్ ను స్థాపించడానికి పార్వతీపురం మన్యం జిల్లా యంత్రాంగం ప్రాజెక్టును సిద్ధం చేసింది. వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అనుభవ పూర్వకంగా విద్యను అభ్యసించడం ద్వారా విద్యార్థులను ప్రోత్సహించడం, పరిశీలన, డేటా రికార్డ్ చేయడం, నిర్ణయాలు తీసుకోవడం, సమస్యలను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను పెంపొందించడం, నాణ్యమైన విద్యను సాధించడం, విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో ఉన్నత చదువులు చదవాలనే సంకల్పంతో ప్రతిపాదించామన్నారు. కాన్సెప్ట్ అవగాహన ద్వారా నైపుణ్యాలు, జ్ఞానాన్ని పొందే అవకాశాన్ని ఈ ప్రాజెక్టులో పొందుపరిచామని చెప్పారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, గిరి శిఖర ప్రాంతాల్లో ఉన్న గ్రామాల నుండి ముఖ్యంగా ఆర్థికస్థోమత లేని గిరిజన సమూహాల (పివిటిజిలు) నుండి ఉన్న 9 నుండి 12వ తరగతి వరకు గల సుమారు 2,21,917 మంది విద్యార్థులు ఈ ప్రాజెక్ట్ నుండి ప్రయోజనం పొందబోతున్నారని చెప్పారు. జెఎన్టీయూ, ఆంధ్రా యూనివర్సిటీ తదితర ప్రాంతాల నుంచి మాస్టర్ ట్రైనర్లను గుర్తించామని తెలిపారు. పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో ఈ ప్రాజెక్టును ఏర్పాటు చేయనున్నారు. జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం, ఖగోళ శాస్త్రం, రసాయన శాస్త్ర ప్రయోగ శాలలను సంబంధిత నమూనాలతో ప్రతిపాదించారు.

ఎంపిక చేసిన ఉపాధ్యాయులు, అధ్యాపకులు ప్రాజెక్టులో భాగస్వాములుగా ఉంటారు. సివిల్ పనులు, అన్ని నమూనాలను కొనుగోలు 15 రోజుల్లో ప్రారంభించుటకు జిల్లా యంత్రాంగం యోచిస్తోంది. జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత ప్రాజెక్టును సిద్ధం చేయడంలో కీలక పాత్ర పోషించారు. నీతి ఆయోగ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డాక్టర్ బివిఆర్ సుబ్రహ్మణ్యం ఈ ప్రాజెక్ట్ "అద్భుతమైన" ప్రాజెక్ట్ అని ప్రశంసించారు. ఇది మంచి ప్రతిపాదన అని, అటల్ టింకరింగ్ ల్యాబ్లోని నీతి ఆయోగ్ జాతీయ స్థాయి ఎగ్జిక్యూటివ్ బృందం మద్దతు ఇస్తుందని, అందుకు నోడల్ అధికారిని నియమించాలని కోరారు. ఈ మేరకు రెవెన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత ను నోడల్ అధికారిగా నియమించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, పార్వతీపురం రెవెన్యూ డివిజనల్ అధికారిణి కె. హేమలత, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణి డి. మంజుల వీణ, జిల్లా విద్యా శాఖాధికారి ఎన్. ప్రేమకుమార్ పాల్గొన్నారు.